# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 03 సంచిక : 138 గురువారం 26-02-2026 పేజీలు : 4 వెల : 2/-



క్రైం కౌంటర్ News

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలంగాణ సూర్యాపేట్ జిల్లా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు

రిపోర్టర్లు కావలెను

- జిల్లా బ్యూరోలు

- నియోజక వర్గ ఇన్చార్జీలు

Contact No: 98497 07349


## 22వ వార్డులో ముమ్మరంగా కాలువల పూడికతీత పనులు.





వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు.

క్రైం కౌంటర్ న్యూస్ కోదాడ, ఫిబ్రవరి 25 ( గురునాథం జిల్లా బ్యూరో )

సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గం కోదాడ మున్సిపల్ పట్టణంలోని 22వ వార్డులో వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు వీలుగా మురుగు కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క, పూడికను తొలగించే పనులను బుధవారం ముమ్మరంగా నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎర్నేని వెంకటరత్నం బాబు (కుసుమ బాబు), స్థానిక కౌన్సిలర్ తూనం కృష్ణ సమక్షంలో ప్రోక్లైన్ సహాయంతో కాలువలను శుభ్రం చేయించారు. వర్షపు నీటితో స్థానికంగా నివసించే వారికి ఇబ్బందులు కలగకుండా పనులను చేపట్టినట్లు వారు తెలిపారు. కాలువల్లో నీరు నిలిచిపోకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని వార్డు ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వారి వెంట కౌన్సిలర్ యలమందల నరసయ్య, గోపిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, వీరారెడ్డి, మధు, హనుమంతరావు, ఉస్మాన్, పనింద్ర, సైదులు, దేవమణి తదితరులు పాల్గొన్నారు.

## నాయి బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తా.





- కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు.
- చైర్‌పర్సన్ కుసుమ కు నాయి బ్రాహ్మణ సంఘం సన్మానం.

క్రైం కౌంటర్ న్యూస్ కోదాడ, ఫిబ్రవరి 25 ( గురునాథం జిల్లా బ్యూరో )

నాయి బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు హామీ ఇచ్చారు. బుధవారం కోదాడ నాయి బ్రాహ్మణ సేవా సంఘం పట్టణ అధ్యక్షులు ఆలేటి గోపి ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిల సహకారంతో నాయి బ్రాహ్మణులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని తెలిపారు. వృత్తి పరంగా ఎదురయ్యే కష్టసుఖాల్లో తాను ఎల్లప్పుడూ తోడుంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షులు ఆలేటి గోపి, సంఘం పెద్దలు సురభి నరసయ్య, తాడేపల్లి గోవిందరావు, ఆలేటి చిన్న సత్యనారాయణ, మాధవరపు సీతారాములు, ఆలేటి వెలగొండ,ఆలేటి వెంకటేశ్వర్లు, గుడిమల్ల శ్రీహరి, వినుకొండ శ్రీనివాస్, సన్నాయిల వీరబాబు, తూముల రాంబాబు, కేతవరపు సైదులు, పిన్నెల్లి మురళి, వెన్నెల శీను, ఆలేటి సహదేవ్ తాడేపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల ఆరోగ్య కార్డులు - క్యాష్ లెస్ (ఈహెచ్ఎస్).



క్రైం కౌంటర్ కోదాడ, ఫిబ్రవరి 25 ( గురునాథం జిల్లా బ్యూరో )

రాష్ట్ర టీఎన్జీవో అధ్యక్షులు మారం జగదీశ్వర్, కార్యదర్శి ముజీబ్ ఆదేశాల మేరకు ఉద్యోగులకు ఆరోగ్య కార్డులు, ఉద్యోగులకు 1.20 కోట్ల ప్రమాద బీమా, 60 సంవత్సరాల లోపు సహజ మరణం చెందితే 10 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ మంజూరు జేయడం లాంటి రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ నిర్ణయం తీసుకున్న ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించిన టీఎన్జీవోఎస్ నాయకులు. అనంతరం పరిశ్రమలు మరియు ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహకి, ఐఏఎస్ అధికారుల కమిటీ సభ్యులైన నవీన్ మిట్టల్, లోకేష్ కుమార్, ప్రతేకించి ఐఏఎస్ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావుకి ధన్యవాదములు తెలిపారు.

తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, కార్మిక, ఉపాధ్యాయుల, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ బాగస్వామ్య ఉద్యోగ సంఘాల నిరంతర కృషి వల్ల ఉద్యోగుల ఆరోగ్య కార్డులు (ఈహెచ్ఎస్), వైద్య విభాగం 010 పద్దుక్రింద జీతాలు తిసూకునే ప్రక్రియా సాధ్యమైంది. అలాగే భవిష్యతులో కూడ ప్రధాన డిమాండ్లైనా పిఆర్సి పెండింగ్ బిల్లులను నేలకు 700 కోట్ల నూండి 1500 కోట్లకు ఐక్యాంగా ఉండి హక్కులు సాదించుకుంటమని తెలిపారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న వారు టీఎన్జీవోఎస్ జిల్లా నాయకులు వి ప్రకాశ్, ఎన్ రవి, టీఎన్జీవోఎస్ ప్రధాన కార్యదర్శి సూర్యాపేట జిల్లా ఎస్ నవీన్, ట్రైజరరీ ఎన్ ఆంజనేయులు, పర్యవేక్షకులు పి ప్రసాద్, టీఎన్జీవోఎస్ నాయకులు బి. ఉమశ్రీ, సాయి రాంరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ జె లత, జూనియర్ అసిస్టెంట్ వి. నాగస్పందన, పి. మానస, ఏఈఈ హరిచంద్ర, ఏఈఈ తేజశ్రీ, ఏఈఈ పి ఊర్మిళ, టైపిస్ట్ పులి శ్రీనివాస్, టీఎన్జీవోఎస్ నాయకులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి క్యాంప్ కార్యాలయ కంచెకు రూ.9 కోట్లు





సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీష్ రావు సంచలన ఆరోపణలు చేశారు. జూబ్లీహిల్స్‌లో రూ.వందల కోట్లతో ప్యాలెస్ లాంటి క్యాంప్ కార్యాలయాన్ని నిర్మించుకుంటున్నారని మండిపడ్డారు. అదే సమయంలో రైతులకు మాత్రం రైతు భరోసా నిధులు విడుదల చేయకుండా వారి నోట్లో మట్టి కొడుతున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా పాలన అని చెప్తూనే.. ప్రజా ధనాన్ని విలాసాలకు ఖర్చు చేస్తున్నారని హరీష్ రావు ఆరోపించారు. తెలంగాణలో రైతులకు రైతు భరోసా నిధులు విడుదల చేయకపోవడంపై రేవంత్ రెడ్డి సర్కార్‌ను ఉద్దేశించి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా పాలకుల విలాసాలకు, పెద్ద పెద్ద కాంట్రాక్టర్లకు ప్రజా ధనాన్ని ధారబోస్తూ..

2లో

సమయం విలువ తెలిసినవాడే నిజమైన ధనవంతుడు.

మంచి మాట

## రఘు ఆశయాలను సాధిద్దాం.



పూర్ణ చందర్ రావు.

క్రైం కౌంటర్ న్యూస్ కోదాడ, ఫిబ్రవరి 25 ( గురునాథం జిల్లా బ్యూరో)

కోదాడ మాజీ ఎలక్ట్రాన్ మీడియా అధ్యక్షులు పరిశాల రఘు ఆశయాలను సాధించిన నాడే ఆయనకు మనం ఇచ్చే ఘన నివాళులు కోదాడ ఎలక్ట్రాన్ మీడియా గౌరవ అధ్యక్షులు పూర్ణ చంద్రావు అన్నారు. రఘు ప్రథమ వర్ధంతి సందర్భంగా పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో విలేకరులు రఘు సమాధి వద్దకు వెళ్లి కొవ్వొత్తులు వెలిగించి పూలమాలలు సమాధి వద్ద ఉంచి నివాళులర్పించారు. అనంతరం పూర్ణ చందర్ రావు మాట్లాడుతూ పడిశాల రఘు ఎలక్ట్రాన్ మీడియా రంగానికి ఎనలేని సేవలు చేసి ఎలక్ట్రాన్ మీడియా రంగం అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. విలేకరుల ఆపదంటే అర్ధరాత్రి అయినా లెక్క చేయకుండా వారి సమస్యను పరిష్కరించిన తర్వాతనే తన పనులు చూసుకునేవాడని అలాంటి ఉన్నత విలువలు కలిగిన జర్నలిస్టును కోల్పోవడం ఎలక్ట్రాన్ మీడియా రంగానికి తీరని లోటు అని తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో కోదాడ మాదిగ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు చెరుకుపల్లి శ్రీకాంత్, గౌరవ అధ్యక్షులు బంక వెంకటరత్నం ,చీమ చంద్రశేఖర్, ఏపూరి సునీల్ రత్నాకర్, ఎన్. శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు.



- ప్రజలకు గౌరవప్రదమైన సేవలే లక్ష్యం.
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

క్రైం కౌంటర్ న్యూస్, ఫిబ్రవరి 25 ( గురునాథం జిల్లా బ్యూరో )

రాష్ట్రంలో ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకమైన పరిపాలన అందించాలనే లక్ష్యంతో తహసీల్దార్ మరియు ఆర్డీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార మరియు పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు తెలిపారు. మొదటి దశలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న 60 తహసీల్దార్ కార్యాలయాలు, 5 ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. అలాగే రెండవ విడతలో శిథిలావస్థలో ఉన్న 170 ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలను నిర్మిస్తామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా డిజైన్ చేయనున్నట్లు తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో చర్చించి డిజైన్లకు తుది రూపు ఇస్తామని చెప్పారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందేలా ఈ భవనాల నిర్మాణం ఉంటుందన్నారు. బుధవారం సచివాలయంలో తన కార్యాలయంలో రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో మంత్రిగారు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఎన్ని తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి, శిథిలావస్థ, పాలనకు అనువుగా లేని భవనాలు వివరాలను సేకరించారు. "ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడం సరైంది కాదు. ప్రజలకు సేవలందించే కేంద్రాలు గౌరవప్రదంగా ఉండాలి" అన్న గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి గారు స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు, ఏర్పడిన తర్వాత కూడా రెవెన్యూ కార్యాలయాలు ప్రజలకు సౌకర్యవంతంగా లేకపోవడంతోపాటు చాలా వరకు అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వం ముందుచూపు లేకుండా, ప్రణాళికాబద్ధత లేకుండా మండలాల పునర్విభజన చేపట్టిందని, కొన్ని మండలాలు రెండు మూడు జిల్లాల పరిధిలోకి వచ్చే విధంగా రూపొందించిందని మంత్రి విమర్శించారు. అనేక కార్యాలయాల్లో కనీస వసతులు లేకపోవడం, సిబ్బంది కొరత తీవ్రంగా ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త మండలాలకు అవసరమైన పోస్టులు మంజూరు చేసి పరిపాలనను బలోపేతం చేశామని తెలిపారు. అలాగే ప్రజలకు దూరంగా కలక్టరేట్‌లను నిర్మించి నిర్వహణను గాలికివదిలేశారని విమర్శించారు. స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్ శాఖలో అత్యాధునిక వసతులతో సమీకృత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి సమీకృత భవనాలు నిర్మిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే గచ్చిబౌలి, మేడ్చల్-మల్కాజిగిరి, పఠాన్ చెరువులలో భవనాలకు శంకుస్థాపన పూర్తయ్యిందని, గచ్చిబౌలిలో నిర్మాణ పనులు తుది దశలో ఉండి మరికొద్ది నెలల్లో ప్రారంభానికి సిద్ధమవుతుందని తెలిపారు. రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను ఆధునికీకరించి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి గారు తెలిపారు.

# రేవంత్ రెడ్డి క్యాంప్ కార్యాలయ కంచెకు రూ.9 కోట్లు



సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీష్ రావు సంచలన ఆరోపణలు చేశారు. జూబ్లీహిల్స్‌లో రూ.వందల కోట్లతో ప్యాలెస్ లాంటి క్యాంప్ కార్యాలయాన్ని నిర్మించుకుంటున్నారని మండిపడ్డారు. అదే సమయంలో రైతులకు మాత్రం రైతు భరోసా నిధులు విడుదల చేయకుండా వారి నోట్లో మట్టి కొడుతున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా పాలన అని చెప్తూనే.. ప్రజా ధనాన్ని విలాసాలకు ఖర్చు చేస్తున్నారని హరీష్ రావు ఆరోపించారు. తెలంగాణలో రైతులకు రైతు భరోసా నిధులు విడుదల చేయకపోవడంపై రేవంత్ రెడ్డి సర్కార్‌ను ఉద్దేశించి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా పాలకుల విలాసాలకు, పెద్ద పెద్ద కాంట్రాక్టర్లకు ప్రజా ధనాన్ని ధారబోస్తూ.. రైతులకు రైతు భరోసా ఇచ్చేందుకు మాత్రం రాష్ట్ర ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవని హరీష్ రావు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యతలు, రైతుల పట్ల అనుసరిస్తున్న వైఖరిపై తీవ్ర ఆరోపణలు గుప్పించారు. రైతుల కన్నీళ్లతో పునాదులు వేసుకున్న ప్రభుత్వం చరిత్రలో ఎన్నడూ మనుగడ సాగించిన దాఖలాలు లేవని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో ఓట్ల కోసం అబద్ధపు హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు తమ ప్రాధాన్యతలను పూర్తిగా మార్చుకుందని విమర్శలు గుప్పించారు. ప్రజాధనాన్ని మంచి నీళ్ల లాగా ఖర్చు చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. విలాసాలకు, కాంట్రాక్టర్ల కమీషన్లకు ఖర్చు చేస్తూ.. దేశానికి అన్నం పెట్టే రైతులకు మాత్రం పెట్టుబడి సాయాన్ని ఇచ్చేందుకు మాత్రం నిధులు లేవని కుంటి సాకులు చెబుతోందని తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీది ప్రజా పాలన అని చెప్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కోసం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో వందల కోట్ల రూపాయలతో ప్యాలెస్ నిర్మించుకుంటున్నారని హరీష్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. సీఎం క్యాంప్ కార్యాలయం చుట్టూ ఏర్పాటు చేయనున్న ఇనుప కంచెల (ఫెన్సింగ్) కోసమే ఏకంగా రూ.9 కోట్లు ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. ఇక అందులో ఒక్క ఫుట్‌బాల్ కోర్టు ఏర్పాటు చేయడం కోసం రూ. 5 కోట్లు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. అందాల పోటీలకు (మిస్ వరల్డ్ పోటీలు).. ఆటలకు (మెస్సీ రాక) వందల కోట్ల రూపాయలు తగలేస్తున్నారని.. అదే సమయంలో దేశానికి వెన్నెముకగా ఉన్న రైతుల నోట్లో మాత్రం మట్టి కొడుతున్నారని హరీష్ రావు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఇలాంటి పగటి వేషాలు కట్టిపెట్టి.. రైతు భరోసా నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇక మున్సిపల్ ఎన్నికలు ముగిసిన వెంటనే రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులు జమ చేస్తామని ఫిబ్రవరి 4వ తేదీన మిర్యాలగూడ సభలో స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి.. ప్రకటించిన విషయాన్ని గుర్తు చేసిన రేవంత్ రెడ్డి.. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసి 10 రోజులు దాటినా.. నిధుల విడుదలపై ఎలాంటి అప్‌డేట్ లేదని మండిపడ్డారు. రైతు భరోసా పథకంలో భాగంగా ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని నమ్మించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పటికే రెండు సీజన్లలో నిధులు ఇవ్వకుండా ఎగ్గొట్టిందని ఆరోపించారు. ఇటీవల నిర్వహించిన తెలంగాణ మంత్రివర్గ సమావేశంలోనూ రైతుభరోసా, రైతుల సమస్యలపై ప్రభుత్వం చర్చించకపోవడం.. రైతులపై వారికి ఉన్న కపట ప్రేమను చూపిస్తోందని ఆరోపించారు. ఇక రైతు భరోసాకు నిధులు లేవంటున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ఇతర ప్రాజెక్టులకు రూ.వేల కోట్లను ఎక్కడి నుంచి తెస్తోందని ఈ సందర్భంగా హరీష్ రావు ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టు పేరుతో, పార్కుల నిర్మాణానికి, ఇళ్ల కూల్చివేత పరిహారాలకు రూ.వేల కోట్ల ఖర్చు చేస్తున్నారని.. భూసేకరణ, రోడ్ల నిర్మాణానికి భారీగా నిధులు కూడా కేటాయిస్తున్నారని గుర్తు చేస్తున్నారు. అదే సమయంలో కేవలం ఈ ఆర్థిక ఏడాదిలోనే బడా కాంట్రాక్టర్ల కోసం రూ.25 వేల కోట్ల బిల్లులను రిలీజ్ చేశారని విమర్శించారు. ఢిల్లీ పెద్దలకు మూటలు పంపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు ఉంటాయి కానీ.. రైతులకు ఇచ్చేందుకు మాత్రం చేతులు రావా అని రేవంత్ రెడ్డిని హరీష్ రావు నిలదీశారు.

# భద్రాద్రి రాములోరి పట్టు వస్త్రాలు మాయం..



శ్రీరామనవమికి ముందు భద్రాద్రిలో అపచారం చోటు చేసుకుంది. ఆలయంలో స్వామి వారికి సమర్పించిన పట్టు వస్త్రాలు మాయం కావడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే ఆలయంలో ఉన్న సీసీటీవీ కెమెరాలకు కూడా చిక్కకుండా దొంగలు వాటిని ఎత్తుకెళ్లిపోవడం గమనార్హం. అయితే ఇది ఇంటి దొంగల పనే అని గుర్తించిన ఆలయ అధికారులు.. ఈ ఘటనపై విచారణకు ఆదేశించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలోనే భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాల కోసం ఇప్పటికే భద్రాద్రి ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు. అయితే ఇదే సమయంలో భద్రాద్రి రామయ్య వద్ద జరిగిన సంఘటన ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. భద్రాద్రి రామాలయంలో ఇప్పుడు ఇంటి దొంగలు చేతివాటం ప్రదర్శించారు. స్వామి వారికి భక్తులు సమర్పించిన పట్టు వస్త్రాలు మాయం కావడం తీవ్ర కలకలం రేపుతోంది. ఇంటి దొంగలను ఈశ్వరుడైనా పట్టుకోలేడు అన్నట్లు.. ఇప్పుడు స్వామికి పెట్టిన పట్టు వస్త్రాలు చోరీకి గురి కావడం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఓ భక్తురాలు భద్రాచలం రామాలయంలో సీతాదేవికి సమర్పించిన ఓ విలువైన పట్టుచీర మాయం కావడం తీవ్ర చర్చకు దారి తీసింది. ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలకు కూడా చిక్కకుండానే గర్భగుడిలో నుంచి ఆ పట్టు చీర అదృశ్యం కావడం భద్రాద్రి దేవస్థాన సిబ్బంది నిర్లక్ష్యాన్ని ప్రత్యక్షంగా ఎత్తి చూపుతోంది. ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఈవో దామోదర్ రావు విచారణకు ఆదేశించారు.

# తెలంగాణలో పింఛన్లు రూ.4 వేలకు పెంపు, మహిళలలకు రూ.2500..




పింఛన్ల పెంపు, మహిళలకు రూ.2500 ఇచ్చేందుకు తెలంగాణ సర్కార్ చర్యలు చేపట్టింది. త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ఈ రెండు హామీలను అమలు చేసే దిశగా కసరత్తులు చేస్తోంది. వచ్చే నెల 20న ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో పింఛన్ల పెంపు, మహిళలకు ఆర్థిక సాయానికి సంబంధించిన కీలక ప్రకటనలు ఉంటాయనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ రెండు పథకాల అమలుకు సంబంధించి అదనపు భారంపై సంబంధిత అధికారులు ముఖ్యమంత్రికి నివేదికలు అందించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తుండగా.. ఎన్నికల హామీల్లో మిగిలిన మరిన్ని హామీలను అమలు చేసే దిశగా చర్యలు చేపట్టింది. 2023లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని ఎన్నికల హామీలను అమలు చేయగా.. మరికొన్ని ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. అయితే అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే 6 గ్యారెంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించినా.. రాష్ట్ర ఖజానాలో డబ్బు లేకపోవడం వల్ల అన్నీ అమలు చేయలేక పోతున్నామని తెలిపింది. ఈ నేపథ్యంలోనే మార్చి 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు తెలంగాణ బడ్జెట్ సమావేశాలు జరగనుండగా.. 20న తేదీన రేవంత్ రెడ్డి సర్కార్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే ఈ బడ్జెట్‌లోనే పింఛన్ల పెంపు, మహిళలకు రూ.2500 ఆర్థిక సాయంపై ప్రకటన ఉండొచ్చనే వార్తలు ఇప్పుడు తీవ్ర ఆసక్తికరంగా మారాయి. మరోవైపు.. ఆసరా పెన్షన్లలో భాగంగా పింఛన్లను వృద్ధులకు రూ.4 వేలకు, దివ్యాంగులకు రూ.6 వేలకు పెంచుతామని ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ తెలిపింది. అయితే ఇప్పటివరకు మాత్రం ఈ హామీ అమలు కాలేదు. దీంతో పింఛన్ పెరుగుతుందని భావిస్తున్న వారంతా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు.. పింఛన్ల పెంపునకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నివేదిక కూడా అందించింది. ప్రస్తుతం రూ.2 వేలు ఇస్తున్న వృద్ధాప్య పెన్షన్లను రూ.4 వేలకు, దివ్యాంగుల పెన్షన్లకు రూ.6 వేలకు పెంచితే.. ఇప్పుడు అయ్యే ఖర్చు కంటే రాష్ట్ర ఖజానాపై ఎంత అదనపు ఖర్చు అవుతుందనే దానిపై సమగ్ర రిపోర్టును అందించింది. ఆ నివేదికకు అనుగుణంగా త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో నిధులు కేటాయించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. మరోవైపు.. మహాలక్ష్మి పథకం లో భాగంగా రాష్ట్రంలో 18 ఏళ్లు దాటి అర్హులైన మహిళలు అందరికీ ప్రతీ నెలా రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో వెల్లడించింది. దీనికి సంబంధించి కూడా ఈ బడ్జెట్‌లోనే ప్రకటన వెలువరించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఇప్పటికే ఈ మహాలక్ష్మి పథకం అమలుకు నిధుల అందుబాటుపై ఆర్థిక శాఖ.. సీఎం రేవంత్ రెడ్డికి నివేదికలు కూడా అందించింది. దీనిపై బడ్జెట్‌లో ప్రకటన చేయనున్నారని సమాచారం. ఇక బడ్జెట్ సమావేశాలకు ముందు కేబినెట్ భేటీలో ఈ పథకాల అమలుపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ రెండు పథకాలతోపాటు విద్యార్థులకు ఫ్రీ ల్యాప్ టాప్‌లు అందించే పథకంపైనా రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంటుందని సమాచారం.

# టీజీఎస్ఆర్టీసీలో మరోసారి సమ్మె సైరన్..



ఆర్టీసీ కార్మికులు మరోసారి సమ్మె సైరన్ మోగించేందుకు సిద్ధమవుతున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, పెండింగ్ బకాయిల విడుదల, జీతాల పెంపు సహా పలు డిమాండ్లపై కార్మికులు పోరుబాటకు రెడీ అవుతున్నారు. మార్చి 13లోపు న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుంటే సమ్మె నోటీసు ఇచ్చి స్ట్రైక్ చేస్తామని కార్మికులు హెచ్చరిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (TGSRTC)లో మరోసారి సమ్మె సైరన్ మోగే అవకాశం కనిపిస్తోంది. కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మరోసారి పోరుబాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించకపోవడంతో.. జాయింట్ యాక్షన్ కమిటీ (JAC) ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేయాలని నిర్ణయించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, జీతాల పెంపు, పెండింగ్ బకాయిల విడుదల సహా పలు డిమాండ్లపై కార్మికులు పోరుబాటకు సిద్ధమవుతున్నారు. జేఏఆస్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద వేలాది మంది కార్మికులు ధర్నా చేశారు. మార్చి 13 తేదీలోపు డిమాండ్లను పరిష్కరించకపోతే సమ్మె నోటీసు ఇవ్వటంతో పాటు మార్చి 18 తర్వాత స్ట్రైక్ చేస్తామని సర్కార్‌ను హెచ్చరించారు.

**ప్రధాన డిమాండ్లు ఇవే..**

కాగా, కార్మికులు ప్రధానంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని గత కొన్నేళ్లుగా కోరుతున్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కొత్త పే రివిజన్ కమిషన్ నివేదికను అమలు చేసి, పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలను పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో నిలిపివేసిన డీఏలు, పీఎఫ్, ఇతర పెండింగ్ బకాయిలను వెంటనే కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని.. సంస్థలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు, డ్రైవర్లు, కండక్టర్లపై పెరుగుతున్న పని ఒత్తిడిని తగ్గించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో సర్కార్ నుంచి సానుకూల స్పందన రాకపోవటంతో సమ్మెకు వెళ్లాలని భావిస్తున్నారు. కాగా, ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగితే.. ఆర్టీసీ బస్సుల్లో నిత్యం ప్రయాణించే లక్షలాది మంది కార్మికులకు ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, నిత్యం ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు, గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాలకు వచ్చే సామాన్యులు తీవ్రంగా ఇబ్బందులు పడే ఛాన్సుంది. ప్రభుత్వం ఈలోపే స్పందించి కార్మిక సంఘాలతో చర్చలు జరిపి సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మూసీ సుందరీకరణ పనులు.. నిర్వాసితులలకు గేటెడ్ కమ్యూనిటీల్లో ఫ్లాట్లు..!

- మూసీ సుందరీకరణ పనులు
- నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ
- వద్దనుకుంటే గేటెడ్ కమ్యూనిటీల్లో ఫ్లాట్లు

మూసీ సుందరీకరణ పనుల్లో భాగంగా నిర్వాసితులుగా మారుతున్న నార్సింగి మధు పార్కు రిడ్జ్ అపార్ట్‌మెంట్ వాసులకు మెరుగైన ప్యాకేజీ ఇచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. రెండు రకాలుగా వారికి ఫ్యాకేజీ ఆఫర్ చేస్తున్నట్లు తెలిసింది. భారీ మొత్తంలో డబ్బులు లేదా గేటెడ్ కమ్యూనిటీల్లో ఫ్లాట్లు ఇవ్వాలని భావిస్తున్నారట. తెలంగాణ ప్రభుత్వం మూసీ సుందరీకరణ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంగతి తెలిసిందే. మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా 3200 ఎకరాలు సేకరించనున్నట్లు గెజిట్ నోటిఫికేషన్‌లో సర్కార్ పేర్కొంది. 10 వేల నిర్మాణాలు ప్రభావితం అవుతాయని తెలిపింది. ఈ ప్రాజెక్టులో భాగంగా.. నార్సింగి పరిధిలోని మధు పార్కు రిడ్జ్ అపార్ట్‌మెంట్‌వాసులు ఇళ్లు ఖాళీ చేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో వారికి మెరుగైన ప్యాకేజీ ఇచ్చేందుకు సర్కార్ రెడీ అయింది. అపార్ట్‌మెంట్ మొత్తాన్ని సేకరిస్తుండటంతో రెండు విధాలా వారికి పునరావాసం కల్పించేందుకు జిల్లా ఇంఛార్జ్ మంత్రులు ఆలోచించినట్లు తెలిసింది. తమ ఆలోచనలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన మరికొన్ని సూచనలు ఇచ్చారట. మధు పార్కు రిడ్జ్ అపార్ట్‌మెంట్‌లో మొత్తం 420 ఫ్లాట్లు ఉన్నట్లు తేలింది. వారిలో డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ యజమానులకు రూ.60లక్షల నుంచి రూ.70 లక్షల ప్యాకేజీ, ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ యజమానులకు రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షల వరకూ ప్యాకేజీ ఇచ్చే ఛాన్స్ ఉందట. ఈ డబ్బులు తీసుకోని పక్షంలో 11 గేటెడ్ కమ్యూనిటీల్లో నచ్చినచోట ఫ్లాట్లను ఇప్పించనున్నట్లు తెలిసింది. నార్సింగి పరిధి టిప్పుఖాన్ బ్రిడ్జి సమీపంలోని మధు పార్కు రిడ్జ్ అపార్ట్‌మెంట్ ప్రస్తుతం బఫర్‌జోన్‌లో ఉందని రెవెన్యూ అధికారులు వెల్లడించారు. మొత్తం 6.5 ఎకరాల విస్తీర్ణంలో ఈ అపార్ట్‌మెంట్ ఉండగా.. అందులో 2.5 ఎకరాలు బఫర్ పరిధిలో ఉందని చెప్పారు. కాగా, మూసీ నదికి రెండువైపులా 50 మీటర్ల వరకు మాత్రమే స్థలాలను అధికారులు తెలిపారు. ఇతర వదంతులు నమ్మొద్దని సూచించారు. భూసేకరణ నోటిఫికేషన్‌తో అపార్ట్‌మెంట్ వాసులు ఒక్కసారిగా ఆందోళనకు గురి అవుతున్నారని.. ప్రభుత్వం వారి అంగీకారంతోనే ఆస్తుల స్వాధీన ప్రక్రియను ప్రారంభిస్తుందని తెలిపారు. బఫర్ జోన్‌లో నిర్మాణాలను స్వాధీనం చేసుకొని తగిన నష్టపరిహారం చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాజేంద్రనగర్, గండిపేట మండలాల్లో 85 ఎకరాలను స్వాధీనం చేసుకోనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఆస్తుల స్వాధీనంపై ఇంకా సర్వేను ప్రారంభించలేదని అన్నారు.






## పాకిస్తాన్ పై ఇంగ్లండ్ గెలుపు...

## పెరిగిన హీటు...

- టీ20 వరల్డ్‌కప్ సెమీఫైనల్ రేసులో హీటు పెరిగింది..
- ఇంగ్లండ్ వచ్చేసింది, భారత్‌పై ఫుల్ ప్రెషర్!

ఐసీసీ టీ 20 వరల్డ్‌కప్ 2026లో ఇంగ్లండ్ పాకిస్తాన్‌పై గెలిచి సెమీఫైనల్‌కు చేరగా, మిగిలిన మూడు స్థానాల కోసం పోటీ తీవ్రంగా మారింది. గ్రూప్ - 1లో వెస్టిండీస్, సౌతాఫ్రికా దూకుడు చూపుతుండగా, భారత్ నెట్ రన్‌రేట్‌తో కష్టాల్లో పడింది. డేవిడ్ మిల్లర్, మార్కో జాన్సెన్ ప్రదర్శన భారత్‌కు షాక్ ఇచ్చింది. ఇక మిగిలిన మ్యాచ్‌లు మూడు జట్ల భవిష్యత్తును నిర్ణయించనున్నాయి. భారత్ రెండు మ్యాచ్‌లలో గెలిచి, వెస్టిండీస్ సౌతాఫ్రికాపై ఓడిపోతే టీమిండియా సెమీ ఫైనల్‌లో అడుగుపెట్టే అవకాశం ఉంది. భారత్, శ్రీలంక వేదికగా జరుగుతున్న ఐసీసీ టీ 20 వరల్డ్‌కప్‌లో సెమీఫైనల్ పోరు మరింత ఉత్కంఠభరితంగా మారింది. సూపర్-8 దశలో ఇంగ్లండ్ సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. దీంతో మిగిలిన ఏడు జట్ల మధ్య మూడు స్థానాల కోసం తీవ్ర పోటీ కొనసాగుతోంది.



పల్లెకెలె వేదికగా పాకిస్తాన్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో ఇంగ్లండ్ రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో కెప్టెన్ హ్యారీ బ్రూక్ అద్భుతమైన సెంచరీతో జట్టును గెలుపు తీరాలకు చేర్చాడు. క్లిష్టమైన లక్ష్యాన్ని ఛేదిస్తూ అతను బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఈ విజయంతో గ్రూప్-2లో ఇంగ్లండ్ నాలుగు పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి సెమీస్‌కు చేరింది. గ్రూప్-2లో ఇప్పుడు ఒక్క స్థానం మాత్రమే మిగిలి ఉంది. పాకిస్తాన్, న్యూజిలాండ్, శ్రీలంక జట్లు ఆ స్థానానికి పోటీ పడుతున్నాయి. రాబోయే మ్యాచ్‌లే వారి భవిష్యత్తును నిర్ణయించనున్నాయి. ఇక గ్రూప్-1లో వెస్టిండీస్ జింబాబ్వేపై 107 పరుగుల భారీ విజయంతో టాప్‌లో నిలిచింది. ఈ గెలుపుతో వారి నెట్‌రన్‌రేట్ +5.350కు చేరింది. ఇది టోర్నమెంట్‌లో ఇప్పటివరకు అత్యుత్తమ రికార్డుల్లో ఒకటిగా నిలిచింది. రెండో స్థానంలో సౌతాఫ్రికా జట్టు ఉంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో భారత్‌ను 76 పరుగుల తేడాతో ఓడించి సౌతాఫ్రికా సంచలన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో డేవిడ్ మిల్లర్ 63 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడగా, బౌలింగ్‌లో మార్కో యాన్సన్ చెలరేగాడు. భారత జట్టు మాత్రం ఈ ఓటమితో మూడో స్థానానికి పరిమితమైంది. నెట్ రన్‌రేట్ -3.800కు పడిపోవడంతో సెమీఫైనల్ అవకాశాలు సంకటంలో పడ్డాయి. ఇప్పుడు భారత్ కచ్చితంగా మిగిలిన మ్యాచ్‌లను భారీ తేడాతో గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదే సమయంలో ఇతర జట్ల ఫలితాలపై కూడా ఆధారపడాల్సి వస్తోంది. సూపర్-8 దశలో ప్రతి మ్యాచ్ కీలకంగా మారడంతో అభిమానుల్లో ఉత్కంఠ మరింత పెరిగింది. ఎవరు సెమీఫైనల్‌కు చేరతారన్నది రాబోయే రోజుల్లో తేలనుంది. దాంతో టోర్నమెంట్ ఇప్పుడు నిర్ణాయక దశలోకి ప్రవేశించింది.

## అతనో ఇన్స్యూరెన్స్




టీ20 వరల్డ్ కప్ లో పాకిస్తాన్ పేలవ ఆటతీరుతో సెమీస్ అవకాశాల్ని సంక్లిష్టం చేసుకుంది. ఓ దశలో గ్రూప్ దశ దాటి సూపర్ 8కు చేరుతుందా అన్న అనుమానాల మధ్య నమీబియాను ఓడించి ఎలైట్ గ్రూప్ కు అర్హత సాధించింది. అయితే పాకిస్తాన్ జట్టు ఓడిపోయినప్పుడల్లా తెరపైకి వస్తున్న పేరు బాబర్ ఆజం . పాక్ జట్టులో సీనియర్ బ్యాట్స్ మెన్, మాజీ కెప్టెన్ కూడా అయిన బాబర్ తన స్థాయికి తగ్గ ఆటతీరు కనబర్చకపోయినా ఇంకా జట్టులో కొనసాగిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ఇంగ్లాండ్ చేతిలో పాకిస్తాన్ చిత్తుగా ఓడిపోయిన నేపథ్యంలో ఆ జట్టు మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ బాబర్ ఆజం గురించి కీలక వ్యాఖ్యలు చేశాడు. జట్టు విజయాల పరిస్థితి ఎలా ఉన్నా బాబర్ ఆజంకు మాత్రం ఓటమి లేదన్నాడు. జట్టు సెటప్‌లోని రాజకీయ, నిర్మాణాత్మక వాస్తవాల వల్ల అతన్ని కోచ్ మైక్ హెస్సెన్ ఇన్స్యూరెన్స్ పాలసీగా మార్చి వాడుకుంటున్నాడని వాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇంగ్లాండ్ చేతిలో పాకిస్తాన్ నిన్న రెండు వికెట్ల తేడాతో ఓడిపోయిన తర్వాత మరోసారి బాబర్ స్థానంపై చర్చ మొదలైంది. ఈ మ్యాచ్‌లో బాబర్ 4వ స్థానంలో బ్యాటింగ్ కు దిగి 24 బంతుల్లో 25 పరుగులు చేశాడు. టీ20 ప్రపంచ కప్ చరిత్రలో అతని మొత్తం స్ట్రైక్ రేట్ ఇప్పుడు 111.5కి పడిపోయింది. ఇది టోర్నమెంట్ చరిత్రలో స్పెషలిస్ట్ బ్యాటర్లలో అత్యల్పం. పాకిస్తాన్ కు కోచ్ గా వెళ్లే విదేశీయుల పరిస్థితి తాను అర్థం చేసుకోగలలని, అక్కడ ఏం జరుగుతుందో తాను ఊహించగలనని మైకేల్ వాన్ తెలిపాడు. బాబర్ ఆజంను తప్పనిసరిగా ఆడించాల్సిన రాజకీయ పరిస్థితుల్లో కోచ్ హెస్సెన్ అతన్ని జట్టుకు ఇన్స్యూరెన్స్ లా వాడుకుంటున్నాడని తెలిపాడు. అందుకే అతను నాలుగో స్థానంలో వచ్చి తాపీగా అడుకుంటున్నాడని వివరించాడు.

# భారత్.. సెమీస్ చేరాలంటే ఏం జరగాలి?




దక్షిణాఫ్రికాతో చేతిలో భారత్ ఓటమి తర్వాత.. టీ20 ప్రపంచకప్ 2026 సెమీ ఫైనల్ సినారియోపై అందరి దృష్టి నెలకొంది. ఈ పరిస్థితుల్లో నెట్‌రన్‌రేట్‌తో సంబంధం లేకుండా టీమిండియా ఇప్పటికీ సెమీఫైనల్ చేరే అవకాశం ఉందా? భారత్.. సెమీస్ చేరాలంటే ఏం జరగాలి? దక్షిణాఫ్రికా ఐం వెస్టిండీస్ మ్యాచ్ ఫలితం భారత్‌కు కీలకం కానుందా? అనే అంశాలపై ఈ స్టోరీలో తెలుసుకుందాం. టీ20 ప్రపంచకప్ 2026 సూపర్-8లో ఒక్క ఓటమి.. భారత్‌పై ఒత్తిడి పెంచుతోంది. డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగిన టీమిండియాకు ఈ ఓటమి ఊహించనిదే. మ్యాచ్ ఓడినా.. భారీ పరుగుల తేడాతో ఓడిపోవడం జట్టుకు ఇబ్బందికరంగా మారింది. 2 పాయింట్లతో పాటు నెట్‌రన్‌రేట్ కూడా భారీగా కోల్పోవడం టీమిండియా సెమీస్ అవకాశాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇలాంటి పరిస్థితుల్లోనూ నెట్‌రన్ రేట్‌తో సంబంధం లేకుండా టీమిండియా సెమీస్ చేరేందుకు అవకాశం ఉంది. నెట్ రన్‌రేట్‌తో సంబంధం లేకుండా భారత్.. సెమీస్ చేరేందుకు రెండు మార్గాలు ఉన్నాయి. అవేంటంటే.. మొదటగా.. సూపర్-8లో భారత్.. జింబాబ్వే, వెస్టిండీస్‌తో తలపడనుంది. ఈ రెండు మ్యాచ్‌లలోనూ టీమిండియా విజయం సాధించాలి. అప్పుడు భారత్ ఖాతాలో 4 పాయింట్లు అవుతాయి. ఇక దక్షిణాఫ్రికా ఐం వెస్టిండీస్ మ్యాచ్‌లో.. దక్షిణాఫ్రికా గెలుపొందాలి. అప్పుడు సూపర్-8లో విండీస్ కేవలం జింబాబ్వేపై మాత్రమే గెలిచినట్లవుతుంది. అప్పుడు ఆ జట్టు ఖాతాలో రెండు పాయింట్లు మాత్రమే ఉంటాయి. ఇదే జరిగితే దక్షిణాఫ్రికాతో పాటు టీమిండియా నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. రెండో సినారియో ప్రకారం, భారత్.. తన రెండు మ్యాచ్‌లలోనూ గెలవాలి. ఇదే సమయంలో దక్షిణాఫ్రికా.. జింబాబ్వే, వెస్టిండీస్ చేతిలో ఓడిపోవాలి. అప్పుడు దక్షిణాఫ్రికా ఖాతాలో రెండు పాయింట్లు మాత్రమే ఉంటాయి. నాలుగేసి పాయింట్లతో భారత్, వెస్టిండీస్ సెమీస్ చేరతాయి. అయితే ప్రస్తుత పరిస్థితుల ప్రకారం దక్షిణాఫ్రికా.. జింబాబ్వే చేతిలో ఓడిపోవడం దాదాపు అసాధ్యం. దీంతో దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో వెస్టిండీస్ ఓడిపోతే మాత్రం.. టీమిండియా సెమీస్ అవకాశాలు గణనీయంగా మెరుగుపడతాయి.

పస్తుతం గ్రూప్-1 పాయింట్ల పట్టికలో వెస్టిండీస్ 2 పాయింట్లు, +5.350 నెట్‌రన్‌రేట్‌తో అగ్రస్థానంలో ఉంది. దక్షిణాఫ్రికా 2 పాయింట్లు, +3.800 నెట్‌రన్‌రేట్‌తో రెండో స్థానంలో ఉంది. భారత్ సున్నా పాయింట్లు, -3.800తో మూడో స్థానంలో, జింబాబ్వే సున్నా పాయింట్లు -5.350తో నాలుగో ప్లేసులో ఉంది.

వెస్టిండీస్ ఐం దక్షిణాఫ్రికా మ్యాచ్ ఫిబ్రవరి 26న జరగనుంది. భారత్.. ఫిబ్రవరి 26న జింబాబ్వేతో, మార్చి 1న వెస్టిండీస్‌తో తలపడనుంది. దాదాపుగా ఈ మూడు మ్యాచ్ ఫలితాలే.. గ్రూప్-1 సెమీస్ టీమ్స్‌ను డిసైడ్ చేసే అవకాశం ఉంది.

# నేడు న్యూజిలాండ్ - శ్రీలంక మ్యాచ్..

టీ 20 వరల్డ్‌కప్ 2026 సూపర్ 8లో భాగంగా ఈ రోజు న్యూజిలాండ్ - శ్రీలంక జట్లు తలపడుతున్నాయి. సెమీ ఫైనల్ ఛాన్స్‌ను నిర్ధారించే ఈ మ్యాచ్ ఇరు జట్లకు కీలకంగా మారనుంది. ఆర్. ప్రేమదాస క్రికెట్ స్టేడియం వేదికగా జరిగే ఈ మ్యాచ్ రాత్రి 7 గంటలకు ప్రారంభం కానుంది. మ్యాచ్ లైవ్‌ను స్టార్ స్పోర్ట్స్, జియో హాట్ స్టార్ వేదికగా వీక్షించొచ్చు. సూపర్ 8 నుంచి ఇప్పటి వరకు ఇంగ్లండ్ ఒక్కటే సెమీస్‌లో అడుగుపెట్టింది. సెమీ ఫైనల్స్ దగ్గరపడుతున్న కొద్దీ ప్రతి మ్యాచ్ డూ ఆర్ డైగా మారింది. ఆర్.ప్రేమదాస క్రికెట్ స్టేడియంలో ఈ రోజు న్యూజిలాండ్ - శ్రీలంక మధ్య మ్యాచ్ జరగనుంది. గ్రూప్ 2లో భాగంగా జరిగే ఈ మ్యాచ్ ఇరు జట్ల భవితవ్యాన్ని తేల్చనుంది. శ్రీలంక ఓడితే ఇంటిదారి పట్టనుండగా.. న్యూజిలాండ్ గెలిస్తే సెమీస్ అవకాశాలు బలపరుచుకోనుంది. సూపర్ 8లో భాగంగా న్యూజిలాండ్ - శ్రీలంక మధ్య జరిగే మ్యాచ్ సెమీ ఫైనల్ బెర్త్‌కు మార్గాన్ని చూపనుంది. ఇప్పటికే గ్రూప్ 2 నుంచి వరుస విజయాలతో ఇంగ్లండ్ సెమీ ఫైనల్‌లో అడుగుపెట్టగా.. రెండో స్థానం కోసం న్యూజిలాండ్, శ్రీలంక, పాకిస్తాన్ ఎదురుచూస్తున్నాయి. న్యూజిలాండ్ గెలిస్తే సెమీస్ ఆడే అవకాశాలు ఉండగా.. శ్రీలంక ఓడితే టోర్నీ నుంచి ఎలిమినేట్ అయినట్టే. ఈ మ్యాచ్ రాత్రి 7 గంటలకు ప్రారంభం కానుండగా.. మ్యాచ్ లైవ్ స్టార్ స్పోర్ట్స్, జియో హాట్ స్టార్ వేదికగా వీక్షించొచ్చు. గ్రూప్ 2 సూపర్ 8లో న్యూజిలాండ్ తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావడంతో ఆడకుండానే కివీస్‌కు ఒక పాయింట్ దక్కింది. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ గెలిస్తే మూడు పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగనుంది. చివరగా ఇంగ్లండ్‌తో జరిగే ఆఖరి మ్యాచ్‌లోనూ న్యూజిలాండ్ గెలిస్తే టేబుల్ టాప్‌గా నిలిచి సెమీ ఫైనల్‌లో అడుగుపెట్టొచ్చు. ఒకవేళ ఈ మ్యాచ్‌లో శ్రీలంక విజయం సాధిస్తే ఆ జట్టు రెండు పాయింట్లు వస్తాయి. సూపర్ 8లో పాకిస్తాన్‌తో జరిగే ఆఖరి మ్యాచ్‌లోనూ లంక గెలిస్తే సెమీ ఫైనల్ బెర్త్ కన్ఫార్మ్ చేసుకోవచ్చు. అలా కాకుండా న్యూజిలాండ్‌తో జరిగే మ్యాచ్‌లో శ్రీలంక ఓడిపోతే ఇంటిదారి పట్టడం ఖాయం. శ్రీలంక మ్యాచ్‌లో గెలిచి, ఇంగ్లండ్‌పై ఓడిపోతే న్యూజిలాండ్ జట్టుకు మూడు పాయింట్ల వస్తాయి. అదే సమయంలో శ్రీలంక - పాకిస్తాన్ మ్యాచ్‌లో పాక్ విజయం సాధిస్తే పాకిస్తాన్‌కూ మూడు పాయింట్లు వస్తాయి. అలాంటి పరిస్థితుల్లో నెట్ రన్‌రేట్ కీలకంగా మారుతుంది. మొత్తానికి సెమీ ఫైనల్‌కు ముందు న్యూజిలాండ్ - శ్రీలంక మ్యాచ్ చాలా కీలకంగా మారనుంది.




శ్రీలంక జట్టు అంచనా:

పాతుమ్ నిస్సంక, కమిల్ మిషారా, కుశాల్ మెండిస్, పవన్ రత్నాయకే, కమిందు మెండిస్, దాసున్ శనక (కెప్టెన్), దునిత్ వెల్లలాగే, దుష్మన్ హేమంత, దుష్మంత చమీరా, మహీష్ తీక్షణ, దిల్షాన్ మధుశంక.

న్యూజిలాండ్ జట్టు అంచనా:

టిమ్ సైఫర్ట్, ఫిన్ అలెన్, రచిన్ రవీంద్ర, గ్లెన్ ఫిలిప్స్, మార్క్ ఛాప్‌మన్, డారిల్ మిచెల్, మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), జేమ్స్ నీషమ్, మ్యాట్ హెన్రీ, ఇష్ సోడి, లాకీ ఫెర్గ్యూసన్.

## వైభవ్ సూర్యవంశీకి బాలల అత్యున్నత పురస్కారం



14 ఏళ్ల బిహార్ క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీకి ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కారం దక్కింది. రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని వైభవ్ సూర్యవంశీ స్వీకరించాడు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీని కూడా కలవనున్నాడు. క్రికెట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచినందుకు గాను ఈ గౌరవం లభించింది. విజయ్ హజారే ట్రోఫీలో ఇటీవల ఎంట్రీ ఇచ్చిన వైభవ్ సూర్యవంశీ కేవలం 36 బంతుల్లోనే సెంచరీ, 84 బంతుల్లో 190 పరుగులతో రికార్డు సృష్టించాడు. బిహార్‌కు చెందిన 14 ఏళ్ల క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీ మరో అరుదైన గౌరవాన్ని అందుకున్నాడు. తన దూకుడు బ్యాటింగ్‌తో ఇప్పటికే దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న వైభవ్‌కు ఇప్పుడు ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కారం దక్కింది. ఈ పురస్కారాన్ని న్యూఢిల్లీ వేదికగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వైభవ్ స్వీకరించాడు. పురస్కార ప్రదానోత్సవం అనంతరం, వైభవ్‌తో పాటు ఇతర అవార్డు గ్రహీతలు ప్రధాని నరేంద్ర మోదీని ప్రత్యేకంగా కలుసుకోనున్నారు. దేశ యువతలో ప్రేరణ నింపే లక్ష్యంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. క్రికెట్ రంగంలో అద్భుత ప్రతిభను కనబరిచినందుకుగాను ఈ పురస్కారం వైభవ్‌కు దక్కింది. చిన్న వయసులోనే జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం అతడి కెరీర్‌లో ఓ చారిత్రక ఘట్టంగా నిలిచింది. అవార్డు కార్యక్రమంలో పాల్గొనడం కారణంగా వైభవ్ విజయ్ హజారే ట్రోఫీ మిగతా మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడు. ఫీల్డ్‌లో ఆడే అవకాశం కోల్పోవడం ఏ ఆటగాడికైనా కష్టమే అయినా, దేశ స్థాయిలో గౌరవం అందుకోవడం జీవితంలో అరుదైన అవకాశం అని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇటీవల అరుణాచల్ ప్రదేశ్‌తో జరిగిన విజయ్ హజారే ట్రోఫీ తొలి మ్యాచ్‌లో వైభవ్ చేసిన ప్రదర్శనతో రికార్డులు బద్దలయ్యాయి. కేవలం 84 బంతుల్లో 190 పరుగులు చేసి, బిహార్‌ను భారీ స్కోర్ దిశగా నడిపించాడు. ఆ ఇన్నింగ్స్‌తో వైభవ్ దేశీయ క్రికెట్‌లో అత్యంత దూకుడు బ్యాటర్లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. చిన్న వయసులోనే పెద్ద రికార్డులు నెలకొల్పుతూ, భవిష్యత్ భారత క్రికెట్‌కు ఆశాజనకంగా మారాడు. సీనియర్ జట్టులోకి కూడా వైభవ్‌ను తీసుకోవాలనే వాదన కూడా వినిపిస్తోంది.

ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కారం అనేది 5 నుంచి 18 ఏళ్ల పిల్లలకు ఇచ్చే భారతదేశ అత్యున్నత పౌర గౌరవం. సాహసం, కళ - సంస్కృతి, పర్యావరణ పరిరక్షణ, ఆవిష్కరణలు, సైన్స్ అండ్ టెక్నాలజి, సామాజిక సేవ, క్రీడల్లో ప్రతిభ చూపిన బాలలకు ఈ అత్యున్నత పురస్కారాన్ని అందజేస్తారు.




## ఓటీటీ కి 'ఓం శాంతి శాంతి శాంతిః'




తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బ, జంటగా నటించిన చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః' ఏఆర్ సజీవ్ తెరకెక్కించారు. గోపరాజు రమణ, బ్రహ్మాజీ, సురభి ప్రభావతి ముఖ్య పాత్రలు పోషించారు. జనవరి 30న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. మార్చి 4వ తేదీ నుంచి ఆహా వేదికగా స్ట్రీమింగ్ కానుంది. ఆహా ఓ పోస్టర్‌ను ఈ విషయాన్నీ తెలిపింది. ప్రశాంతి (ఈషా రెబ్బ) మధ్య తరగతి కుటుంబంలో పుట్టి బాగా చదువుకుని ఉద్యోగం చేయాలనుకునే యువతి. అయితే ఇంట్లో నియమ నిబంధనలతో ఆమెకు ఎలాంటి స్వేచ్ఛ లేకుండా చేస్తారు. ప్రశాంతి కాలేజ్ లో లెక్చరర్ తో చిన్న ప్రేమాయణం నడపడంతో సడన్ గా చదువుకు ఫుల్ స్టాప్ పెట్టించి పెళ్ళి చేయాలనుకుంటారు కుటుంబ సభ్యులు. రాజమండ్రి సమీపంలో చేపల వ్యాపారం చేసే ఓంకార్ నాయుడు (తరుణ్ భాస్కర్)తో ప్రశాంతి పెళ్లి జరుగుతుంది. పెళ్లి తర్వాత కూడా చదువుకోవచ్చనే అంగీకారంతో ప్రశాంతి అతనితో మూడు ముళ్ళు వేయించుకుంటుంది. అయితే పెళ్ళి తర్వాత కూడా ప్రశాంతి జీవితం తను కోరుకున్నట్లు ఉండదు. ఓంకార్ నాయుడు మాటిమాటికీ తనపై చేయి చేసుకుంటుంటాడు. ఈ పంచాయతీని కన్నవారి ముందుంచితే సర్దుకుపోవాలంటూ సలహా ఇచ్చి పంపుతారు. ఇవన్నీ తట్టుకుంటూ, సమయం రాగానే ఎదురు తిరిగి భర్తకు బుద్ధి చెబుతుంది. దానికి ఓంకార్ వేసిన ప్లాన్ ఏంటి? వీరి బంధం సుఖంగా సాగిందా? లేదా? అన్నదే మిగతా కథ.

## తిరుమల శ్రీవారి దర్శనం వివాదం..



నటి శివానీ నాగారం ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తనకు తిరుమలలో 15 నిమిషాల పాటు స్వామివారి దర్శనం కలిగిందని చెప్పడం వివాదానికి దారితీసింది. సెలబ్రిటీలకు టీటీడీ పెద్దపీట వేస్తోందని నెటిజన్లు విమర్శించగా, శివానీ తాజాగా వీడియో ద్వారా వివరణ ఇచ్చింది. తాను తన తల్లితో కలిసి రూ. 10500 శ్రీవాణి దర్శనం టికెట్లు తీసుకొని వెళ్లామని తెలిపింది. లైన్‌లో స్వామివారు కొంచెం కొంచెం కనిపిస్తూ వెళ్లే మొత్తం సమయాన్ని కలిపి తాను 15 నిమిషాలని అన్నానని, అంతేకానీ గర్భాలయంలో ఎవరూ తనను ఎక్కువసేపు ఉంచలేదని ఆమె స్పష్టం చేసింది. 'అంబాజీపేట మ్యారేజీ బ్యాండు', 'లిటిల్ హార్ట్స్', 'హే బల్వంత్' సినిమాలతో హ్యాట్రిక్ విజయాలు అందుకుంది శివానీ నాగారం . ఇప్పుడు క్రేజీ ఆఫర్స్ అందుకుంటున్న ఈ తెలుగమ్మాయి.. ఇటీవల అనుకోకుండా ఓ వివాదంలో చిక్కుకుంది. 'హే బల్వంత్' మూవీ ప్రమోషన్స్ లో భాగంగా ఇచ్చిన ఓ పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూలో తనకు 15 నిమిషాలపాటు స్వామివారి దర్శక భాగ్యం దక్కిందని చెప్పింది. దీనిపై సోషల్ మీడియాలో విమర్శలు వచ్చాయి. హీరోయిన్లకు ప్రత్యేక దర్శనాలు ఇస్తున్నారంటూ టీటీడీని ప్రశ్నిస్తూ సామాన్య భక్తులు పోస్టులు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా శివాజీ ఓ వీడియో రిలీజ్ చేసింది. శివానీ నాగారం మాట్లాడుతూ.. "ఇటీవల యూట్యూబ్ లో ఒక ప్రైవేట్ ఛానల్ లో పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూ ఇచ్చాను. ఆ ఇంటర్వ్యూర్ నన్ను కొన్ని క్వశ్చన్లు అడిగారు. నా చైల్డ్ హుడ్ జర్నీ, సక్సెస్, డివోషనల్ జర్నీ, స్పిరిచువల్ ఎక్స్పీరియన్సెస్ గురించి ప్రశ్నలు అడిగారు. నేను నా స్పిరిచువల్ జర్నీ షేర్ చేసుకున్నాను. కేదార్ నాథ్, రామకోటి రాయడం, శిరిడీ వెళ్లడం గురించి చెప్పాను. అందులో తిరుపతి గురించి కూడా నేను మాట్లాడాను. దాంట్లో 15 నిమిషాల దర్శనం అనేది కొంచెం హైలైట్ అవుతుంది. దానికి నేను క్లారిటీ ఇవ్వడానికి ఈ వీడియో చేస్తున్నాను. 2025 అక్టోబర్ లో నేను ఎయిర్ పోర్టులో మా అమ్మ లైన్ లో నిల్చొని రూ.10500 శ్రీవాణి దర్శనం టికెట్ తీసుకున్నాం. మా ఆధార్ కార్డులు అవన్నీ ప్రూఫ్స్ గా ఉన్నాయి" అని తెలిపింది. "శ్రీవాణి టికెట్స్ తీసుకున్నాక దర్శనం జరిగింది. 15 మినిట్స్ అని చెప్పడంలో నా మెయిన్ మోటివ్ ఏంటంటే, లైన్ లో మనం నిల్చున్నప్పుడు, దగ్గరకు వెళ్లేకొద్దీ స్వామి వారు కొంచెం కొంచెం కనిపిస్తూ ఉంటారు. అదంతా కలిపి నేను అందాజాగా 15 నిమిషాలు అని అన్నాను. అంతే తప్ప 15 నిమిషాలు నన్ను ఎవరూ టచ్ చేయలేదు అని కాదు. ఇంతకుముందు కూడా నేను సినిమాలు చేసిన తర్వాత ఆ సర్వదర్శనం రూ.300 టికెట్ తీసుకొని మా ఫ్యామిలీ తోని కలిసి వెళ్లాను. అప్పుడు గట్టిగా ఒక 5 సెకండ్లు మాత్రమే స్వామి వారిని చూశాను. నా లైఫ్ లో ఫస్ట్ టైం 13 ఏళ్ల తర్వాత స్వామి వారిని అంత దగ్గరగా చూడడం జరిగింది""అందుకు నేను చాలా హ్యాపీగా ఫీల్ అయ్యి ఎగ్జైట్మెంట్ తో, చాలా జెన్యూన్ గా షేర్ చేసుకున్న ఎక్స్పీరియన్స్ అంతే. కానీ నేను చెప్పింది కొంచెం మిస్ లీడింగ్ గా వెళ్తోంది. నాకు స్పెషల్ ట్రీట్మెంట్ ఇవ్వలేదు. నాకే కాదు మీలో ఎవరైనా ఎప్పుడైనా సరే శ్రీవాణి దర్శనం టికెట్ తీసుకొని వెళ్తే కచ్చితంగా స్వామివారి దర్శనం దగ్గరగా, చాలా మంచిగా జరుగుతుంది. నాలాగే మీరు కూడా హ్యాపీగా అంతే అనుభూతి చెందుతారు. బాధ్యతగా నాకు దీనిపై క్లారిటీ ఇవ్వాలనిపించింది" అని శివానీ చెప్పుకొచ్చింది. ఈ సందర్భంగా తన శ్రీవాణి దర్శనం టికెట్ కూడా చూపించింది.

## పూరి దర్శకత్వంలో బాలయ్య ?



నందమూరి బాలకృష్ణ , క్రేజీ డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్ అంటేనే మాస్ ప్రేక్షకులకు ఒక పూనకం. వీరిద్దరి కలయికలో వచ్చిన పైసా వసూల్ (గ్ఖిఅయి ఖుంశీశీశ్రీ) బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని అందుకున్నా, ఆ సినిమాలో బాలయ్య బాడీ లాంగ్వేజ్, పూరి మార్కు మేనరిజమ్స్ అభిమానులకు సరికొత్త అనుభూతిని అందించాయి. అప్పటి నుండి వీరిద్దరి మధ్య ఒక ప్రత్యేకమైన అనుబంధం ఏర్పడింది. అయితే, నటసింహం బాలకృష్ణ శైలి ఇప్పుడు పూర్తిగా మారింది. ఒకప్పుడు కేవలం తనకు నచ్చిన వారికి అవకాశాలు ఇచ్చే బాలయ్య, ఇప్పుడు మాత్రం కథకే ప్రాధాన్యత ఇస్తున్నారు. కథలో బలం ఉండాలి, తన పాత్ర డిజైన్ కొత్తగా ఉండాలి, అన్నిటికీ మించి దర్శకుడి విజన్ మీద నమ్మకం కుదరాలి. అందుకే గోపీచంద్ మలినేని, బాబీ, అనిల్ రావిపూడి వంటి యంగ్ మరియు మాస్ డైరెక్టర్లతో వరుసగా సినిమాలు చేస్తూ సక్సెస్ బాటలో పయనిస్తున్నారు. పూరి జగన్నాథ్ విషయానికి వస్తే.. ఆయనతో ఒక్కసారి పనిచేసిన ఏ హీరో అయినా ఆయన స్టైల్‌కు ఫిదా అయిపోతారు. పూరి రాసే క్యారెక్టరైజేషన్లు హీరోలను సరికొత్తగా ఆవిష్కరిస్తాయి. అందుకే ఆయన ఒక సరైన కథతో వస్తే చాలు, టాలీవుడ్ హీరోలందరూ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడానికి సిద్ధంగా ఉంటారు. అయితే పూరి సినిమాలు బాక్సాఫీస్ వద్ద 'హిట్ లేదా ఫట్' అన్నట్లుగా ఉండటం కొంత రిస్క్ అని భావించినా, ఆయన క్రియేటివిటీ మీద నమ్మకం మాత్రం తగ్గదు.స్తుతం పూరి జగన్నాథ్, వర్సటైల్ యాక్టర్ విజయ్ సేతుపతితో ఒక సినిమా చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ దాదాపు పూర్తి కావచ్చింది. దీని తర్వాత పూరి దృష్టి మళ్ళీ బాలయ్య మీద పడినట్లు సమాచారం. నందమూరి హీరో కోసం పూరి ఒక పక్కా మాస్ కథను సిద్ధం చేశారని సినీ సర్కిల్స్ లో టాక్ వినిపిస్తోంది. ఈ కాంబినేషన్ మళ్ళీ సెట్స్ మీదకు వెళ్తే బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయమని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. అయితే ఈ కథను బాలయ్యకు పూరి వినిపించారా లేదా అనే విషయంలో ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. కానీ వీరిద్దరి మధ్య ఉన్న బాండింగ్ చూస్తుంటే, మరో సినిమా చేయాలనే ఆలోచన మాత్రం బలంగా ఉన్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే దీనికి సంబంధించి ఇండస్ట్రీలో చిన్నపాటి కదలిక కూడా మొదలైందని సమాచారం. పూరి మార్కు డైలాగులు, బాలయ్య గర్జన తోడైతే థియేటర్లు దద్దరిల్లడం ఖాయం. బాలయ్య ప్రస్తుత షెడ్యూల్ గమనిస్తే, ఆయన చేతిలో ఇప్పటికే రెండు భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. ముందుగా గోపీచంద్ మలినేని సినిమా త్వరలోనే ప్రారంభం కానుంది. ఆ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వంలో మరో సినిమా పట్టాలెక్కనుంది. ఈ రెండు పూర్తయ్యాకే పూరి సినిమాకు అవకాశం ఉంటుంది. మరి పూరి సిద్ధం చేసిన కథకు బాలయ్య ఓకే చెబితే, ఈ క్రేజీ కాంబో ఎప్పుడు మొదలవుతుందో చూడాలి.

..........................................................

## విజయ్ సేతుపతి.. సాయి పల్లవి.. మణిరత్నం.. ఓ ఫ్యామిలీ డ్రామా



లెజెండరీ దర్శకుడు మణిరత్నం మరోసారి క్రేజీ కాంబినేషన్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నట్టు కోలీవుడ్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. వరుస డిజాస్టర్లతో కొంత వెనకబడ్డ ఆయన, 'ఒకే బంగారం' తో మళ్లీ సక్సెస్ ట్రాక్‌లోకి వచ్చారు. దుల్కర్ సల్మాన్, నిత్యా మీనన్ జంటగా వచ్చిన ఈ రొమాంటిక్ డ్రామా తమిళంతో పాటు తెలుగులోనూ మంచి విజయాన్ని అందుకుంది. తదుపరి 'థగ్ లైఫ్'తో ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయారు. ఇప్పుడు ఆయన మళ్లీ ఓ సరికొత్త కథతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారని తెలిసింది. ఈసారి రొమాంటిక్ ఫ్యామిలీ డ్రామాగా తెరకెక్కబోయే చిత్రానికి విలక్షణ నటుడు విజయ్ సేతుపతిని హీరోగా ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. సహజమైన నటనతో ప్రేక్షకుల హృదయాలు గెలుచుకున్న సాయి పల్లవి ఈ చిత్రంలో కథానాయికగా నటించబోతోందని టాక్ నడుస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ ఈ సినిమాను నిర్మించబోతోందని కోలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, నటీనటులు, సాంకేతిక నిపుణులు, కథా నేపథ్యం వంటి అంశాలను త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నట్టు తెలిసింది

## నాగార్జున స్టూడియోలో అతిపెద్ద మోషన్ క్యాప్చర్ ల్యాబ్..



అక్కినేని నాగార్జున, నిర్మాత శోభు యార్లగడ్డ కలిసి భారతదేశంలోనే అతిపెద్ద మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ ల్యాబ్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించారు. ఎస్.ఎస్.రాజమౌళి ఈ మోషన్ క్యాప్చర్ ఫెసిలిటీని లాంచ్ చేసి, దీనికి సంబంధించిన వివరాలను పంచుకున్నారు. తన తదుపరి చిత్రం 'వారణాసి' కోసం ఇప్పటికే ఈ టెక్నాలజీని ఉపయోగించినట్లు వెల్లడించారు. ఇకపై విజువల్ వండర్స్ కోసం మన ఫిలిం మేకర్స్ ఇతర దేశాలపై ఆధారపడాల్సిన అవసరం లేదని నాగార్జున, రాజమౌళి అన్నారు. తెలుగు సినిమా ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా సత్తా చాటుతోంది. మన ఫిలిం మేకర్స్ హాలీవుడ్ రేంజ్ లో సినిమాలు తెరకెక్కిస్తున్నారు. ఎప్పటికప్పుడు సరికొత్త టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ, బిగ్ స్క్రీన్ పై అద్భుతమైన చిత్రాలను ఆవిష్కరిస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు ఆధునిక టెక్నాలజీలో తెలుగు సినీ ఇండస్ట్రీ మరో ముందడుగు వేయడానికి 'అన్నపూర్ణ స్టూడియోస్' మార్గం సుగమం చేసింది. హాలీవుడ్ స్టూడియోలకే పరిమితమైన వరల్డ్ క్లాస్ మోషన్ క్యాప్చర్ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. మోషన్ క్యాప్చర్ టెక్నాలజీతో హాలీవుడ్ ఫిలిం మేకర్స్ విజువల్ వండర్స్ క్రియేట్ చేస్తున్న సంగతి తెలిసిందే. 'అవతార్' లాంటి సినిమాలు ఈ టెక్నాలజీ సాయంతోనే రూపొందించారు. ఈ సాంకేతికత కోసం తెలుగు మేకర్స్ ఇతర దేశాల స్టూడియోలపై ఆధారపడాల్సి వచ్చేది. అయితే ఇప్పుడు భారతదేశంలోనే అతిపెద్ద మోషన్ & పెర్ఫార్మెన్స్ క్యాప్చర్ టెక్నాలజీని మోక్యాప్ ల్యాబ్' పేరుతో అక్కినేని నాగార్జునకు చెందిన అన్నపూర్ణ స్టూడియోస్ బుధవారం ప్రారంభించింది. అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి తన చేతుల మీదుగా ఈ ల్యాబ్‌ను ఆవిష్కరించారు. అన్నపూర్ణ స్టూడియోస్, 'బాహుబలి' నిర్మాత శోభు యార్లగడ్డకు చెందిన మిహిరా విజువల్ ల్యాబ్స్, హాలీవుడ్ కంపెనీ యానిమాట్రిక్ ఫిల్మ్ డిజైన్ సంయుక్తంగా ఈ మోషన్ క్యాప్చర్ టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చాయి. రాజమౌళి గతంలో అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఏర్పాటు చేసిన 'డాల్బీ సినిమా ప్రాసెస్' సౌకర్యాన్ని ప్రారంభించారు. ఇప్పుడు మోషన్ క్యాప్చర్ టెక్నాలజీని ఆవిష్కరించారు. ఈ విషయాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ, రాజమౌళి సోషల్ మీడియాలో షేర్ చేసుకున్నారు. రాజమౌళి ప్రస్తుతం సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా 'వారణాసి' అనే గ్లోబ్ ట్రాటింగ్ యాక్షన్ అడ్వెంచర్ మూవీని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో కొన్ని కీలక సన్నివేశాలను అన్నపూర్ణ స్టూడియోస్‌లోని మోక్యాప్ ల్యాబ్'లోనే షూట్ చేసినట్టు రాజమౌళి తెలిపారు. ఫైనల్ గా హైదరాబాద్ లోనే వరల్డ్ క్లాస్ మోషన్ క్యాప్చర్ ఫెసిలిటీ అందుబాటులోకి వచ్చినందుకు చాలా హ్యాపీగా ఉందని అన్నారు. భారతీయ సినీ ప్రయాణంలో ఇదొక మైలురాయి అని నాగార్జున అభివర్ణించారు. ఇందులో గేమింగ్, యానిమేషన్, ఫీచర్ ఫిలిం మేకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. వరల్డ్ సినీ నిర్మాణ సంస్థలకు ఇండియా నుంచే అత్యుత్తమ టెక్నీషియన్స్ వెళ్తున్నారని, కానీ అలాంటి అధునాతన సౌకర్యాలు మాత్రం మనకు అందుబాటులో ఉండటం లేదని రాజమౌళి ఈ సందర్భంగా అన్నారు. "బాహుబలి, ఈగ, ( === )వంటి సినిమాలు తెరకెక్కిస్తున్నప్పుడు.. మనకు మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ సౌకర్యం ఉంటే ఇంకా బెస్ట్ గా ఎలా చేయొచ్చా? అనుకునేవాడిని. ఎట్టకేలకు ఇది మనకు అందుబాటులోకి వచ్చింది. ఇండియన్ ఫిలిం మేకర్స్ ఆలోచనా ధోరణి అత్యుత్తమ స్థాయికి తీసుకెళ్లొచ్చు. నేను ప్రపంచవ్యాప్తంగా ఉన్న మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ స్టూడియోలను సందర్శించా. ఏ అండ్ ఎం వరల్డ్ క్లాస్ టెక్నాలజీని అందిస్తోంది. ఆల్రెడీ 'వారణాసి' కోసం ఈ ఫెసిలిటీ వినియోగించుకుని కీలకమైన మోషన్ క్యాప్చర్ సీన్స్ తీశా. అవి అద్భుతంగా వచ్చాయి" అని రాజమౌళి చెప్పారు.

Owned by Katikala Vara Prasad,Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Banka Indira . at D.no. 465 Le out no2. Dodleru Road. Ysr jagananna colony. Krosuru.Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/2015/62250. Ph:9849707349 email:kvp6858@gmail.com